
సాక్షి
బాపట్ల
ఆదివారం । 2 । మార్చి । 2025



నేతి వెంకన్న స్వామికి నీరాజనాలు

రాజుపాలెం: దేవరంపాడు కొండపై వెలసిన నేతి వెంకన్న స్వామి మొదటి శనివారం తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. నెయ్యి, బెల్లం, కంది పప్పు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 529.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 6,006 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గ్రంథం ఆవిష్కరణ



పొన్నూరు: పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో శనివారం డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 'సావిత్రిబాయి పూలే' 92వ గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.



న్యూస్‌రీల్

బాల కోటేశ్వరస్వామి తిరునాళ్ల ఆదాయం రూ 50.77 లక్షలు



అమర్తలూరు(వేమూరు): మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా శ్రీబాల కోటేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలో భక్తులు వేసిన కానుకలను శనివారం లెక్కింపు చేయడం జరిగిందని దేవస్థానం ఈఓ అశోక్ కుమార్ తెలిపారు. కానుకలు రూ.13,81,983, అభిషేకాలు, దర్శనం, షాపుల అద్దెలు, ఖాళీ స్థలం టెండర్లు, కొబ్బరి చిప్పలు సేకరణ, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.36,95,391 ఆదాయం వచ్చిందని తెలిపారు. మొత్తం రూ.50,77,374 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది కన్నా, ఈ ఏడాది రూ.1,87,311 అదనపు ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు



నగరంపాలెం : ఉమ్మడి కృష్ణా –గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లను శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. కళాశాల ఆవరణలోని పలు విభాగాలు సందర్శించారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చే సిబ్బంది, ఆయా పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లను నిశితంగా పరిశీలించి అనుమతించాలని సూచించారు. స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను లెక్కింపు కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం భద్రతా ఏర్పాట్లకు తగినంత పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తుకు నియమించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. లెక్కింపు సిబ్బంది, ఏజెంట్లు ద్విచక్ర వాహనాలను ఏసీ కళాశాల ఎదురు రాష్ట్ర గ్రంథాలయం, బౌద్ధ మ్యూజియంలో నిలుపుదల చేయాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ అభ్యర్థులు తమ వాహనాలను ఏసీ న్యాయ కళాశాలలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. పోలీసు శాఖ వాహనాలను సీబీడీ కార్యాలయం ఎదురు ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా ఏఎస్పీ హనుమంత్, తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలు రెడ్డి, తహసీల్దార్లు, సీఐలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్ప శయనోత్సవం



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం భక్తిశ్రద్ధలతో పుష్ప శయనోత్సవాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా చివరి రోజు అమ్మవారు పుష్పశయ్య అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతసేవ, హారతులతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా నివేదన, పంచ హారతులు, ద్వాదశ ప్రదక్షిణాలు, ఫల ప్రదానం, పవళింపు సేవను అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివరాత్రి వేడుకలు ముగిసినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పేర్కొన్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకారాలు అందించిన ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బరితెగింపుపై చర్యలేవీ..?!

- అధికారం అడ్డుపెట్టి టీడీపీ నేతల దౌర్జన్యాలు
- పోలీసుల సమక్షంలోనే పీడీఎఫ్ నాయకుడిపై దాడి అమానుషం
- ఫిర్యాదు చేసినా కేసుకట్టని పోలీసులు తీరుపై నిరసన
- ఘటనపై వామపక్షాలు, ప్రజాసంఘాల నేతల రౌండ్ టేబుల్
- గొలపల శ్రీనివాసరావును అరెస్ట్ చేయాలని డిమాండ్
- పచ్చనేతలకు దాసోహమంటున్న అధికారులు, పోలీసుల తీరుపై సర్వత్రా విస్మయం



టీడీపీ నేత గొలపలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా రిగ్గింగును అడ్డుకున్న పీడీఎఫ్ నాయకుడు అనీల్‌పై దాడిచేసిన టీడీపీ బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావును వెంటనే అరెస్ట్ చేయాలంటూ వామపక్ష, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. దాడి జరిగి మూడు రోజులవుతున్నా పోలీసులు టీడీపీ నేతను అరెస్ట్ చేయకపోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలనాడు 144 సెక్షన్ అమల్లో ఉండగా పోలీసు బలగాల సమక్షంలో టీడీపీ నేత గొలపల దాడిచేయడాన్ని ఖండిస్తూనే పోలీసుల తీరును తప్పుబట్టారు. అనీల్‌పై ఉద్దేశపూర్వకంగానే దాడిచేసినట్లు వీడియోలు స్పష్టంగా ఉన్నాయని, అయినా పోలీసులు పట్టించుకోకపోవడాన్ని సమావేశంలో నిరసించారు. పోలింగ్ సమయం మించిపోయాక టీడీపీ నేతలు బూతులో దూరి రిగ్గింగుకు ప్రయత్నించారని, పోలింగ్ జరుగుతున్న మున్సిపల్ పాఠశాల గేట్లు తోసుకొని వెళ్లేప్రయత్నం చేయగా అక్కడే ఉన్న పీడీఎఫ్ నేత అనీల్‌కుమార్ అడ్డుకోవడంతోనే టీడీపీ నేత తన అనుచరులతో కలిసి అనీల్ పై దాడిచేసి కొట్టారని సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. దాడి జరుగుతున్నప్పుడు పోలీసు అధికారులు, పోలీసులు ఉన్నా అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, దాడిచేసిన గొలపల శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేసి మూడురోజులవుతున్నా పోలీసులు అతనిని అరెస్ట్ చేయకపోవడాన్ని తప్పు పట్టారు. పీడీఎఫ్ నాయకుడిపై దాడిచేసిన గొలపలను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష నాయకులు, ప్రజాసంఘాలు పట్టణ సీఐ రాంబాబును కలిసి మరోమారు డిమాండ్ చేశారు. దాడి వీడియోలను మరోమారు సీఐకి చూపించారు. గొలపలపై కేసు పెట్టి అరెస్ట్ చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీడియోలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని నేతలకు సీఐ హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్. గంగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముజుందార్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్, బీఎస్పీకి చెందిన పత్రే కోటయ్య, రాజారావు, జేవీవీ నాయకులు నాగేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో దీపావళి దుకాణాల డ్రా తీస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు(ఫైల్)

అధికారుల తీరుతోనే ఇష్టా'రాజ్యం'

కొందరు అధికారుల తీరుతో జిల్లావ్యాప్తంగా కొందరు టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారంలో ఉన్నాం ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందని, అధికారులు కొమ్ముకాస్తారని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మొన్నటికి మొన్న ప్రభుత్వం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఏకంగా టీడీపీ కార్యాలయాలను వేదికగా చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ ఫ్లెక్సీలు బ్యాక్‌గ్రౌండ్‌గా ఉన్న వేదికమీదనే ప్రజాదర్బార్ నిర్వహించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కార్యక్రమంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌తో పాటు ఇన్‌చార్జి తహశీల్దారు శ్రీదేవి, విద్యుత్‌శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- ఆతర్వాత దీపావళి పండుగ సందర్భంలో బాపట్లలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు నిర్వహించిన డ్రా వ్యవహారంలో అధికారులు వ్యవహరించిన తీరు విమర్శలకు దారితీసింది. స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులు డ్రా తీశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు చేతులమీదుగా కార్యక్రమాన్ని నిర్వహించడం విమర్శలకు దారితీసింది. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అగ్నిమాపక అధికారి, పట్టణ సీఐ పాల్గొనడం విశేషం. ఇప్పుడు అదే పట్టణ అధ్యక్షుడు గొలపల ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో ఏకంగా ప్రత్యర్థిపార్టీ నాయకుడిపై పోలీసులు సమక్షంలోనే దాడికి పాల్పడడం సంచలనం రేపింది.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. బాపట్ల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని వివిధ రూమ్‌లను కలియతిరిగారు. జిల్లాలో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 10,357 విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు. 36 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరిగాయన్నారు. తొలిరోజు 9,927 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 430 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, ప్రశాంత వాతావరణంలో తొలిరోజు పరీక్షలు జరిగాయన్నారు. ఆయన వెంట ఆర్డీఓ పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా, కళాశాల ప్రిన్సిపాల్ జి.కోటేశ్వరరావు, టి.భవాని, తదితరులు ఉన్నారు.

పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యం..

ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే పీ4 లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కుటుంబాల సర్వే, పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్నర్ షిప్(పీ4) కార్యక్రమంపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశం ద్వారా శనివారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా అత్యంత వెనుకబాటుతో ఉన్న నిరుపేద కుటుంబాలను గుర్తించడానికి ఈనెల 8 తేదీ నుంచి 18 వరకు సర్వే చేయాలన్నారు. సర్వే ద్వారా గుర్తించిన నిరుపేదలకు అత్యంత ఆదాయం పొందుతున్న కుటుంబాల నుంచి ఆర్థిక చేయూతనందించే ప్రక్రియను ప్రభుత్వం మార్చి 8వ తేదీన ప్రారంభించనుందన్నారు. కులాలతో సంబంధం లేకుండా నిరుపేదలను గుర్తించడం కోసం 27 రకాల ప్రశ్నలతో వారి వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. శిక్షణ, అవగాహన కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస్, అనుబంధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియెట్ పరీక్షల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి

అంటువ్యాధుల నుంచి పశువులను కాపాడాలి..

అంటువ్యాధుల నుంచి పశు సంపదను కాపాడాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభ సూచికగా వాల్‌పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై సంబంధితశాఖల అధికారులకు సూచనలు చేశారు. ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు పశువులకు వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేస్తారన్నారు. గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేస్తారన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్, తదితరులు, పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు..

వేసవి దృష్ట్యా జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వీడియో సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యతో జిల్లాలో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను ఈనెల 7 నాటికి నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని ట్యాంకులలో 100శాతం నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులకు వృద్ధురాలు మృతి



రోజానమ్మ(ఫైల్)

యాజలి(కర్లపాలెం): ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల వేధింపులతో మనోవేదనకు గురై ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. యాజలి గ్రామానికి చెందిన తూపరి రోజానమ్మ కుమారుడు తూపరి చిన్‌రావు, మనవడు నానిలు ఇల్లు కట్టుకునేందుకు రేపల్లెలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రెండేళ్ల కిందట రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి వరుసగా 15నెలలపాటు కిస్తీలు చెల్లించారు. అనంతరం చిన్‌రావు భార్య మరియమ్మ అనారోగ్యానికి గురికావటంతో కిస్తీలు చెల్లించటం కష్టమైంది. సుమారుగా 5 నెలల వరకు కిస్తీలు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు గురువారం యాజలి గ్రామానికి వచ్చి ఇంటికి వచ్చి నగదు చెల్లించమని కోరగా మావద్ద రూ.30వేలు ఉన్నవి తీసుకోండి మిగతావి వచ్చే నెలలో చెల్లిస్తామని చెప్పినా తీసుకోకుండా సీల్ వేయటంతో చిన్‌రావు తల్లి రోజానమ్మ మనోవేదనతో అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు రోజానమ్మను శనివారం ఉదయం బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ రోజానమ్మ మృతి చెందిందని తెలిపారు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని కర్లపాలెం పోలీసులు తెలిపారు.



రోజానమ్మ గృహానికి ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వేసిన సీల్

పెన్షన్ నగదుతో ఉడాయింపు



సచివాలయం-3 వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

- రూ.8.43లక్షలతో వార్డు సెక్రటరీ పరారీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కమిషనర్

దాచేపల్లి: పింఛన్‌దారుల సొమ్ము తీసుకుని వార్డు సెక్రటరీ పరారైన ఘటనపై నగర పంచాయతీ అధికారులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని వార్డు సచివాలయం–3లో వెల్ఫేర్ సెక్రటరీగా సంపతి లక్ష్మీప్రసాద్ విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు నెలల కిందట గుంటూరు నుంచి డిప్యూటేషన్‌పై వచ్చాడు. బ్యాంక్ నుంచి రూ.8.43 లక్షల పింఛన్ నగదు డ్రా చేసుకుని తన వద్ద పెట్టుకున్నాడు. ఇతను పిడుగురాళ్లలో నివాసం ఉంటున్నాడు. 200 మందికి పింఛన్ నగదు పంపిణీ చేయాల్సి ఉండగా.. ఉదయాన్నే పింఛన్ నగదు కోసం లబ్ధిదారులు ఎదురు చూశారు. ఉదయం 11 గంటలైన పింఛన్ నగదు పంపిణీ చేసేందుకు ఎవరూ రాకపోవటంతో పింఛన్‌దారులు నగర పంచాయతీ కమిషనర్ ఎంవీ అప్పారావుకు ఫిర్యాదు చేశారు. సచివాలయం–3 వద్దకు పింఛన్‌దారులు చేరుకుని పడిగాపులు కాశారు. ఎంతసేపటికీ సెక్రటరీ రాకపోవటంతో ఆందోళన చేశారు. లక్ష్మీప్రసాద్ ఆచూకీ కోసం కమిషనర్ ప్రయత్నాలు చేశారు. అతని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ కావటంతో పిడుగురాళ్లలోని ఇంటికి సిబ్బందిని పంపి ఆరా తీస్తే అందుబాటులో లేడని తెలిసింది. దీంతో కమిషనర్ అప్పారావు దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మీప్రసాద్‌పై ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వార్డు సెక్రటరీ లక్ష్మీప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు కమిషనర్ అప్పారావు చెప్పారు.

ఉపమాసం ప్రారంభం

- మాసమంతా మహిమాన్వితమే!
- నేటి నుంచి నెలరోజులు కఠోర ఉపవాస దీక్షలు, దానధర్మాలు
- మతసామరస్యానికి ప్రతీక రంజాన్

యడ్లపాడు: రంజాన్ మాసం ముస్లింల జీవితాల్లో అత్యంత పవిత్రమైనది. చేతికి దానం..బుద్ధికి భక్తి..దేహానికి క్రమశిక్షణ..మనసుకు ప్రేమ ఒక్క నెలరోజులు అలవాటు చేసే అపురూప మాసమిది. హిజ్రీ క్యాలెండర్ ప్రకారం రమజాన్ అన్నది సంవత్సరంలోని 12 నెలల్లో 9వ నెల పేరు. షాబాన్ మాసం ముగిసే చంద్ర దర్శనంతో రంజాన్ మాసం ఆరంభమవుతోంది. ముస్లింలందరూ నెలరోజులు రోజాతో ఆధ్యాత్మిక చింతన, భక్తిశ్రద్ధలతో గడిపే మాసం రంజాన్. ఈనెల ఆధ్యాత్మిక ప్రయాణానికి, మనో నిగ్రహానికి, మానవీయతకు ప్రతీక. శనివారం నెలవంక దర్శనం అయింది. దీంతో ఆదివారం నుంచి రోజా (ఉపవాసవ్రతం) ముస్లింలు చేపడతారు.

సహరీతో ఆరంభం ఇఫ్తార్‌తో విరమణ

సూర్యోదయానికి ముందే తీసుకునే ఆహారం(సహరీ) అనంతరం భగవంతుని అనుగ్రహాన్ని పొందే ఉద్దేశంతో ఉపవాసాన్ని పాటిస్తారు. దివ్య సూర్యకిరణాలు నడుస్తూ సాగిన అనంతర ఘడియలలో, దాహాన్ని, ఆకలిని అనుభవిస్తూ ఇబాదత్ ద్వారా మనస్సును నిర్మలంగా మార్చుకుంటారు. సూర్యాస్తమయం (ఇఫ్తార్) కాగానే కుటుంబసభ్యులు అంతా కలిసి సామూహికంగా పండ్లు, ఫలహారాలతో దీక్షను విరమిస్తారు. ఇది భౌతిక అవసరాలను మాత్రమే కాదు, మానసిక స్థైర్యాన్ని కూడా పరీక్షించే సమయం.



చిలకలూరిపేట బిలాల్ మసీదుకు రంగులు వేస్తున్న దృశ్యం

వీరికి మినహాయింపు..

రంజాన్ నెలలో బలమైన కారణం లేకుండా ఒక్క రోజును వదిలేసినా ఇక తర్వాత ఏడాదంతా ఉపవాసం పాటించినా సరే..దానితో సరితూగదన్నది ప్రవక్త బోధనల సారాంశం. అయితే బాలింతలు, రుతుక్రమంలో ఉన్న స్త్రీలు, రోగులకు ఇలా కొందరికి మాత్రం మినహాయింపు ఉంది. వీళ్లు ఉపవాసాలు చేయకపోయినా మిగతా రోజుల్లో పాటించి, ఆ సంఖ్యను పూరించాలన్నది ఖురాన్ ఉద్బోధ.

నెలవంక దర్శనం.. దీక్షలు ప్రారంభం

యడ్లపాడు: అత్యంత పవిత్రమైన రంజాన్ మాస ఉపవాస దీక్షలు (రోజా) ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో శనివారం సాయంత్రం మగ్రిబ్ నమాజు అనంతరం ముస్లింలు నెలవంక దర్శనం చేసుకుని ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. మసీదులు, మదరసాలు, ముస్లిం వాడల్లో రంజాన్ ఆధ్యాత్మిక శోభ మొదలైంది. చంద్రదర్శనంతో ప్రత్యేక దువాలు నిర్వహించి, రోజా దీక్షను నిష్ఠగా కొనసాగించేలా అల్లాహ్ అనుగ్రహించాలని భక్తులు ప్రార్థించారు.

దయాగుణం..



రంజాన్ సాధారణ జీవితం నుంచి సమాజానికి ఉపయోగపడే సద్గుణాలను నింపి వారిలో దానగుణాన్ని పెంపొందిస్తుంది. సోదర భావాన్ని కలిగిస్తుంది. ఇదే ఇస్లాం మూల సూత్రాల్లో ప్రధానమైన లక్ష్యం. ఈ మాసంలో చేసే ఒక్కో ఆధ్యాత్మిక, సేవా కార్యానికి అల్లా 70 రెట్లు అధిక పుణ్యఫలం ప్రసాదిస్తారని ప్రవక్త బోధించారు. తమ సంపాదనలో 2.5 శాతం ధనాన్ని పేదలకు పంచాలని అల్లాహ్ ఖురాన్‌లో శాసనం చేశారు. సదఖా, జకాత్, ఫిత్రా దానాల ద్వారా ఈనెలలో పేదలకు ఆర్థిక సాయం విరివిగా అందుతుంది. దీంతో వారి అవసరాలు తీరి ఆనందోత్సవాలతో పండుగను జరుపుకొంటారు.

సత్తెనపల్లిలో వడ్డీ వ్యాపారి ఆగడాలు

- రియల్ ఎస్టేట్ వ్యాపారికి రూ.40 లక్షలు ఇచ్చి రూ.కోటి ఇవ్వాలంటూ బెదిరింపులు
- మూడు రోజుల కిందట కిడ్నాప్ చేసి చిత్రహింసలు
- ఎట్టకేలకు విడిపించిన పోలీసులు

సాక్షి,నరసరావుపేట: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వడ్డీ వ్యాపారి ఆగడాలు శృతిమించాయి. సత్తెనపల్లికి చెందిన పోలిశెట్టి ఆంజనేయ తరుణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు హోటళ్ల వ్యాపారాలు నిర్వహిస్తుంటాడు. గతంలో సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట రాయల్ మండి బిర్యానీ హోటల్ సైతం నిర్వహించాడు. మూడు నెలల క్రితం వ్యాపార అవసరాల నిమిత్తం నగదు అవసరం కావడంతో బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెంకు చెందిన వడ్డీ వ్యాపారి సయ్యద్ చిన్న మహబూబ్ అలియాస్ నన్నే అలియాస్ చిన్నా వద్ద రూ.40 లక్షలు అరువుగా తీసుకున్నాడు. దానికి వారం రోజుల క్రితం మరో రూ.60 లక్షలు వడ్డీ కలిపి మొత్తం రూ.కోటి ఇవ్వా లంటూ ఆంజనేయ తరుణ్‌ను సయ్యద్ చిన్న మహబూబ్ అలియాస్ నన్నే అలియాస్ చిన్నా వేధింపులకు గురి చేస్తున్నాడు. గత నెల 25న పోలిశెట్టి ఆంజనేయ తరుణ్‌ను నన్నేతో పాటు మరో ముగ్గురు కలిసి కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. చంద్రాజుపాలెం, పులిచింతల డ్యామ్, బెల్లంకొండ, గుంటూరు తదితర ప్రాంతాలకు కారులో తిప్పుతూ చిత్రహింసలకు గురి చేశారు. ఆంజనేయ తరుణ్ ఎడమ చేయి మణికట్టు వద్ద మూడు అంగుళాల మేకును సైతం దించారు. అంతేకాక ఇనుప రాడ్డుతో దాడి చేసి మలద్వారంలోకి ఆ రాడ్డును దించారు. తట్టుకోలేక విలపిస్తుంటే రూ.కోటి డబ్బులు ఇవ్వకపోయినా, పోలీసుల దగ్గరకు వెళ్లినా నీ కొడుకును చంపేస్తామంటూ తరుణ్ తండ్రి ఆంజనేయ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి పోలీసులు రంగంలోకి దిగారు. సెల్‌ఫోన్ సిగ్నల్ సాధారణంగా ట్రేస్ చేయగా పేరేచర్లలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో సంఘటనా స్థలానికి చేరుకొని ఆంజనేయ తరణ్‌ను విడిపించి కిడ్నాపర్లు నలుగురుని అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

కూటమి నేతల అండతో రౌడీషీట్ ఎత్తివేత....

వడ్డీ వ్యాపారి సయ్యద్ చిన్న మహబూబ్ అలియాస్ నన్నే అలియాస్ చిన్నా పై గతంలో కూడా అనేక ఆర్థిక పరమైన నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. అవసరాలకు నగదు ఇచ్చి అత్యధిక వడ్డీలు వసూలు చేసేవాడు. డబ్బు తిరి గి ఇవ్వకపోతే చిత్రహింసలకు గురి చేస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే ఇతనిపై పోలీసులు రౌడీషీట్ కూడా తెరిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల రౌడీషీట్‌ను ఎత్తివేశారు. దీంతో మళ్లీ ఆగడాలు శృతి మించాయి. ప్రస్తుతం కేసును కూడా నీరుగార్చేందుకు కూటమి నేతలు యత్నిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

ఆకట్టుకున్న బెక్టాగన్-2025



బాపట్ల: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో బెక్టాగన్– 2025 సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెండో రోజు శనివారం విద్యార్థులతో ఆటలు, పాటలతో గడిపారు. సినీ గాయకుడు యశస్వి పాడిన పాటలు కేరింతలు పెట్టించాయి. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు కళాశాల కార్యక్రమాలను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జేపీ చౌదరి మాట్లాడుతూ సాంకేతిక విద్యకు బంగారు భవిష్యత్ ఉందని, కష్టపడి చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నజీర్, బెక్టాగన్ కన్వీనర్ నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో వృద్ధురాలి మృతి



బాపట్లటౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చోటుచేసుకుంది. కర్లపాలెం మండలం, యాజలి గ్రామానికి చెందిన తుపరి రోజనమ్మ(70) శనివారం ఉదయం గ్యాస్ ఇబ్బందులతో బాపట్ల ఏరియా వైద్యశాలలో చేరారు. వృద్ధురాలికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం కారణంగా మృతి చెందినట్లు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'సఖి వన్ స్టాప్'

సేవలను సద్వినియోగం చేసుకోండి

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్లటౌన్: సఖి వన్‌స్టాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ అన్నారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో రక్తదాన, వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలను శనివారం నుంచి నుంచి మార్చి 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ 1975న ఐక్యరాజ్య సమితి మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందని చెప్పారు. చదువు వల్ల విజ్ఞానం పెంపొందుతుందని చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు, వారి సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం విస్తృతమైన చర్యలను తీసుకుంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళల ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రత్యేకంగా 'ఉమెన్ హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవడానికి అవమానంగా భావించే మహిళలు 'సఖి వన్‌స్టాప్ సెంటర్' ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్ లో స్త్రీ శిశు సంక్షేమ శాఖకు చెందిన మహిళా అధికారులు, పోలీస్, వైద్య, న్యాయ శాఖలకు సంబంధించిన మహిళా అధికారులు ఉంటారన్నారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఏఆర్ డీఎస్పీ విజయ సారథి, బాపట్ల టౌన్, రూరల్, రూరల్ సర్కిల్ సీఐలు రాంబాబు, శ్రీనివాసరావు, హరికృష్ణ, ఆర్ఐ మౌలుద్దీన్, ఏఆర్ ఎస్ఐ శ్రావ్య, డాక్టర్ త్రివేణి, డాక్టర్ మౌనిక, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఉషారాణి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బీ నారాయణభట్టు పాల్గొన్నారు.



రక్తదాతతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

గుంటూరును విద్యా రాజధానిగా తీర్చిదిద్దిన భాష్యం

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో వరుసగా అత్యుత్తమ ర్యాంకులను సాధించడం ద్వారా గుంటూరు నగరాన్ని భారతదేశ విద్యా రాజధానిగా భాష్యం రామకృష్ణ తీర్చిదిద్దారని మానవత సేవా సంస్థ విద్యా కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ అన్నారు. భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా శనివారం చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు. అరవింద్ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు అత్యుత్తమమైన విద్యను అందించడంతో పాటు సామాజిక సేవలో సైతం భాష్యం రామకృష్ణ పాలు పంచుకుంటున్నారని పేర్కొన్నారు. వరదలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో విద్యాసంస్థల ద్వారా ప్రజలకు సహాయపడటంలో ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. మానవతా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాలపాటి శ్రీధర్, సతీష్, యునైటెడ్ వాకర్స్, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, తెలుగు రైతు సంస్థలకు చెందిన ప్రతినిధులు డాక్టర్ నిమ్మల శేషయ్య, ప్రొఫెసర్ వైవీ రెడ్డి, చావా శివాజీ, లక్ష్మి, సాయిరాం, తెలుగు రైతు నాయకులు తాతిరెడ్డి లక్ష్మారెడ్డి తదితరులు భాష్యం రామకృష్ణను అభినందించారు.



భాష్యం రామకృష్ణను అభినందిస్తున్న అరవింద్, రమేష్ తదితరులు

నేడు పెనుగొండకు ఆత్మీయ సత్కారం

గుంటూరు రూరల్: జిల్లా గర్వించదగ్గ ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర ప్రభుత్వం సమున్నత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించటం సంతోషకరమని పార్లమెంట్ మాజీ సభ్యుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం అమరావతిరోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు వైఎస్సార్ విగ్రహం వద్ద గల తనుబుద్ది బసవిరెడ్డినగర్ శ్రీరామ ధామం సమావేశ మందిరంలో పెనుగొడను సత్కరిస్తున్నట్లు తెలిపారు సభాధ్యక్షులుగా మువ్వా చిన్నబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఎంపీ రామిరెడ్డి వ్యవహరిస్తారని, ఆత్మీయ అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీఎస్ చలం, ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ సీహెచ్. సుశీలమ్మ, అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని మోదుగుల కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అమరావతి: మండలంలోని మండెపూడి గ్రామ పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 75 త్యాళ్లూరు నుంచి గుంటూరు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్ మండెపూడి గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న పల్లెపోగు వెంకటేశ్వరరావు (70)ను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఘటనలో అక్కడికక్కడే మరణించాడు. అమరావతి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా తీరంలో విజుబుల్ పోలీసింగ్



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతానగరం, పుష్కర ఘాట్లు, రైల్వే బ్రిడ్జి, కృష్ణాతీరంలోని ఇసుక తిన్నెల్లో శనివారం సాయంత్రం తాడేపల్లి పోలీసులు విస్తృతంగా పర్యటించారు. ఇసుక తిన్నెల్లో సేదతీరుతున్న ప్రేమికులకు, విద్యార్థులకు, మందు బాబులకు, ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు ఆదేశాల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఖాజావలి చెప్పారు. ఈ మధ్య కృష్ణాతీరంలో ప్రేమికులతో పాటు కాలేజీ విద్యార్థులు, ఆకతాయిలు సంచరిస్తున్నారని సమాచారం వచ్చిందని తెలిపారు. దీంతో తీరంలో నాలుగు వైపులా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడకు చెందిన పలువురు విద్యార్థులు కాలేజీలు వదిలిన అనంతరం కృష్ణానదీ తీరానికి వస్తున్నారని, వారితో పాటు కొంతమంది ఆకతాయిలు కూడా వచ్చి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ దాటి ఇటువైపు రావడానికి వీల్లేదని, మరోసారి నిషేధిత ప్రాంతాల్లో సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని విద్యార్థులను హెచ్చరించినట్లు తెలిపారు.

నాటుసారాతో అన్నీ అనర్థాలే

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ విజయ

నిజాంపట్నం: నాటుసారా తాగి అనారోగ్యం తెచ్చుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిండి పంచాయతీ పరిశావారిపాలెం, మండల కేంద్రమైన నిజాంపట్నంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో నాటుసారాకు వ్యతిరేకంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాటుసారాను అపరిశుభ్రంగా, అశాస్త్రీయ పద్ధతిలో తయారు చేయటంతో అనారోగ్యాలకు గురవ్వకతప్పదన్నారు. దీనిలో విషపూరిత రసాయనాలు ఉండి తాగేవారి ఆరోగ్యం రోజురోజుకు క్షీణించటంతో పాటు ఆర్థికంగా, సామాజికంగా తామే తమ కుటుంబాన్ని రోడ్డుపాలు చేసుకున్నవారవుతారని పేర్కొన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. ఎనిమిది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించటం జరుగుతుందని హెచ్చరించారు. సారాయి తయారీకి ఉపయోగించే ముడిపదారాలు విక్రయించే వారిపై నిరంతరం దృష్టిపెట్టినట్లు చెప్పారు. అనంతరం నాటుసారా నిర్మూలనలో ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుతామంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



నాటు సారాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు

కూటమి ప్రభుత్వంలో అరాచకాలు

చీరాల రూరల్: కూటమి ప్రభుత్వంలో రోజురోజుకూ అరాచకాలు పెచ్చుమీరుతున్నాయని, వైఎస్సార్ సీపీ నాయకులపై వేధింపులు, అరెస్టులు నిత్యకృత్యమయ్యాయని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు పేర్కొన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. 2015లో నంది అవార్డులపై మాట్లాడిన పోసాని కృష్ణమురళిని ఇప్పుడు అన్యాయంగా అరెస్టు చేసి వేధించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో కేసు నమోదైందని, కానీ ఇప్పుడు అరెస్టు చేయడం ఏమిటన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు ఏమాత్రం ఉపయోగం లేదని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మఒడికి రూ.16 వేల కోట్లు కేటాయిస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.8 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో చూపించిందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడమంటే విద్య, వైద్యాన్ని ప్రజలకు అందనీయకుండా చేయడమేనా అని ప్రశ్నించారు. బెల్టు షాపుల రూపంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని చెప్పారు. ప్రజలు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న యాతం మేరిబాబు

పెల్లుబికిన పొలికేక 'పుట్టుమచ్చ'

రచయిత ఖాదర్ మొహియుద్దీన్

బాపట్ల: అకారణంగా ఒక జాతిపై వివక్ష, ఆత్మాభిమానం అత్యంత అలుసుగా చూడబడుతున్న వేళ- దానిని స్వయంగా భరించి, సహించి, సహజీవనం చేసిన పిదప పెల్లుబికిన పొలికేకకు ఒక పేరు పెడితే అది 'పుట్టుమచ్చ' అయిందని ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత ఖాదర్ మొహియుద్దీన్ తెలిపారు. శనివారం నిర్వహించిన నెల నెలా నంది వర్ధనం సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన ఖాదర్ మొహియుద్దీన్ 'నా కవిత్వ తత్వం- నిర్మాణం- గమనం- గమ్యం' అనే అంశంపై ప్రసంగించారు. తెలుగు సాహిత్యంలో ప్రాచీన కవుల నుంచి ఆధునిక కవుల దాకా అందరూ అకారణంగా పలుమార్లు ముస్లిం జాతిని వారి సాహిత్య ప్రక్రియల్లో అవమానకరంగా ప్రస్తావించిన తీరుకు తాను ఎంతగానో గాయపడ్డానని, ఇది తన ఒక్కడి గాయం కాదని, కోట్లాది మంది గుండెల్లో గుబులు పుట్టించే గాయంగా మారిపోయిందని, ఇలాంటి అనేక గాయాలు తన కవిత్వంలో ప్రతిబింబించాయన్నారు. కొడవటిగంటి కుటుంబరావు కథలను తిరిగి అక్షరబద్ధం చేసిన అనుభవం, పాత్రికేయ వృత్తి గత జీవితం, వాల్మీకి నుంచి శ్రీ శ్రీ, విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖుల సాహిత్యం మరియు సమకాలీన రచయితల సాహిత్యంతో పరిచయం తన రచనలకు స్ఫూర్తి అని వివరించారు. ఖాదర్ మొహియుద్దీన్‌ను వివేక సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వీవీ నాగరాజు, కార్యదర్శి అంబటి మురళీ కృష్ణ, ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు.

జాగర్లమూడి చెరువులో బాలుడు అదృశ్యం

- స్థానికుల సమాచారం మేరకు పోలీసులు గాలింపు
- రాత్రి పొద్దు పోయేంతవరకు దొరకని ఆచూకీ

పర్చూరు(చినగంజాం): మండలంలోని జాగర్లమూడి ఎస్సీ కాలనీ చెరువులో బాలుడు అదృశ్యమయ్యాడన్న సమాచారం శనివారం కలకలం సృష్టించింది. చెరువులో బాలుడు మునిగిపోతూ కన్పించాడన్న పలువురు స్థానిక మహిళల సమాచారం ఇచ్చారు. కాగా చెరువుకు సమీపంలోని బావి వద్ద చెప్పులు కూడా కన్పించాయి. పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి సంఘటనా స్థలానికి చేరుకొని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మునిగింది బాలుడా లేక యువకుడా అని నిర్ధారణకు రాలేకపోయారు. చెప్పుల ఆధారంగా గాలింపు చేపట్టారు. అందుకోసం ప్రత్యేకంగా చీరాల నుంచి రెస్క్యూ టీం రప్పించి శనివారం రాత్రి పొద్దు పోయేంతవరకు చెరువులో వెతికారు. చీరాల నుంచి రెండు పడవలను రప్పించి గాలించేందుకు పోలీసులు చర్యలు మొదలు పెట్టారు.

వ్యక్తి అయి ఉండవచ్చా?

వీఆర్వో కోటేశ్వరరావు కథనం ప్రకారం స్థానికంగా ఎస్సీ కాలనీలో ఓ కుటుంబానికి చెందిన మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి అలిగి వారి పుట్టింటికి వెళ్లిపోగా ఆమె భర్త శనివారం రాత్రి ఇంటికి రాకపోవడంతో గ్రామస్తులు అతడే ఆత్మహత్యకు పాల్పడ్డాడేమో అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే చెరువు దగ్గర వదలిన చెప్పులు మాత్రం బాలుడు సైజులో ఉండటాన్ని బట్టి వారి అనుమానాలకు బలం చేకూరే పరిస్థితి లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో తెల్లారిన తరువాత నీటిలో మునిగిన మృతదేహం నీటిపైకి తేలి వస్తే గానీ ఆచూకీ కనిపెట్టలేమనేది పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ మాల్యాద్రిని వివరణ కోరగా తెల్లారిన తరువాత గాలింపు కొనసాగిస్తామని తెలిపారు.

ఔషధ మొక్కలతో పలు ప్రయోజనాలు

జిల్లా అటవీ శాఖాధికారిణి హిమ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఔషధ మొక్కలతో మానవాళికి ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా అటవీ శాఖాధికారిణి ఎం. హిమ శైలజ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఔషధ మొక్కలు–ఉత్పత్తుల ప్రదర్శన శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హిమ శైలజ మాట్లాడుతూ అడవుల్లో పెరిగే మొక్కలు, చెట్లలో దీర్ఘకాలిక జబ్బులు, వ్యాధులను నయం చేసే గుణాలున్నాయని తెలిపారు. గతంలో శ్రీశైలంలో పని చేసిన సమయంలో అక్కడి గిరిజనులు అడవుల్లో వన మూలికలను ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగించేవారని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ ఔషధ మొక్కలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రయోజనం చేకూర్చిందని, 120 రకాల మొక్కలను సేకరించి ప్రదర్శనలో ఉంచినట్లు వివరించారు. పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ మాట్లాడుతూ ఔషధ మొక్కలను సేకరించడంలో తమ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పడిన శ్రమను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సాంబశివరావు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ ఔషధ మొక్కలను, ఉత్పత్తులను ఉపయోగించుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చెట్లను నరికివేయడం వల్ల వాటిల్లే నష్టాలను వివరిస్తూ 'వృక్ష విలాపం' పేరుతో రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, పర్యావరణవేత్త చెలికాని సీతారామయ్య, ప్రదర్శన కార్యనిర్వాహక కార్యదర్శులు డాక్టర్ డూనియల్, డాక్టర్ గురవయ్య, అధ్యాపకులు డాక్టర్ సరోజ, శ్రీలత, రోహిత, హారిక, వైష్ణవి, కీర్తి, మల్లీశ్వరి, శ్రావ్య, విద్యార్థులు పాల్గొన్నారు.




వృక్ష విలాపం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హిమ శైలజ తదితరులు

మద్యం మత్తులో నకిలీ పోలీస్ అవతారం

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఓ యువకుడు మద్యం మత్తులో నకిలీ పోలీస్ అవతారం ఎత్తాడు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేసే కార్యక్రమాన్ని శనివారం చేపట్టాడు. ఎందుకు ఇవ్వాలంటూ ప్రజలు ఎదురు తిరగడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఐడీ కార్డు చూపించమంటే దురుసుగా ప్రవర్తించాడు. పోలీస్ అయి ఉండి మద్యం తాగడం ఏమిటని ప్రశ్నించగా, తాగకూడదా ? అంటూ ఎదురు ప్రశ్నవేశాడు. చివరకు అతను నకిలీ పోలీస్ అని గుర్తించి స్థానికులు దేహశుద్ధి చేసి తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. జరిగిన ఈ సంఘటనపై తాడేపల్లి పోలీసులు మాట్లాడుతూ సదరు వ్యక్తి పేరు నాగార్జున అని, వడ్డేశ్వరం నివాసి అని తెలిపారు. మద్యం మత్తులో నకిలీ పోలీస్ అవతారం ఎత్తాడని, గతంలో ఇలాంటి సంఘటనలకు ఏమైనా పాల్పడ్డాడా ? అనే విషయాన్ని విచారిస్తున్నట్లు చెప్పారు.



నాగార్జున